
శ్రీ శృంగగిరి జగద్గురు "శ్రీ సచ్చిదానంద శివాభినవ నృశింహభారతి మహాస్వామి విరచిత

గురు పాదుకా స్తోత్రమ్

- భావార్థముతో -

శ్రీరస్తు శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గౌతమీనగర్, 3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

Kiron Type Institute

గురు పాదుకా స్తోత్రమ్ - భావార్థముతో -

గురు బ్రహ్మ గురుర్విష్ణుః గురు దేవో మహేశ్వరః।
గురు సాక్షాత్ పరం బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః॥

॥ బాహ్య పూజ కంటే మానసిక పూజ (ఆరాధన) చాలా శక్తివంతమైనది ॥

ఒక గురువు యొక్క అనుగ్రహం మీరు ఊహించ లేనంత గొప్పది. అది మనం అనుభూతి చెందుతున్న " గాలి " " సూర్యకాంతి " వలె భౌతిక ఉనికి.

- - - === - - -

01. అనంతసంసార సముద్రతార (04)
నౌకాయితాభ్యాం గురుభక్తిదాభ్యామ్।
వైరాగ్యసామ్రాజ్యద పూజనాభ్యాం
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

శ్రీగురుదేవుల పాదుకలు అంతులేని సంసార సముద్రమును దాటించుటలో నౌకలువంటివి. పెద్దలపట్ల గొప్ప భక్తిని కలిగించునవి. వైరాగ్య సామ్రాజ్యము నొసగునట్టి పూజతో కూడినట్టివియు నగు గురుదేవుల పాదుకలకు మాటి మాటికి నమస్కరింతును.

- - - === - - -

02. కవిత్వవారాశి నిశాకరాభ్యాం (06)
దౌర్భాగ్య దావాంబుద మాలికాభ్యాం।
దూరీకృతానమ్ర విపత్తితాభ్యాం
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

శ్రీ గురుదేవుల పాదుకలు కవిత్వమనెడి కడలికి చంద్రుని వంటివి. (అనగా గురుభక్తి కలిగిన శిష్యులకు చంద్రుని చూచిన సముద్రమువలె కవిత్వముప్పొంగి వచ్చును) దౌర్భాగ్యమనెడి దావాగ్నికి మేఘసమూహములవంటివి. (దౌర్భాగ్యమును పోగొట్టి సౌభాగ్యము నిచ్చును) నమస్కరించినవారి యాపదలన్నింటిని దూరము చేసి సుఖముల నిచ్చునవి యగు గురుదేవుల పాదుకలకు పలుమారులు నమస్కరింతును.

- - - === - - -

03. నతా యయోః శ్రీపతితాం సమీయుః (07)
కదాచిదప్యాశు దరిద్రవర్యాః
మూకాశ్చ వాచస్పతితాం హి తాభ్యాం
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

శ్రీ గురుదేవుల పాదుకలకు మహాదరిద్రులు ఎప్పుడైన ఒక్కసారైన నమస్కరించినచో వారు లక్ష్మీపతిత్వమును పొందుదురు. (అనగా మహాధనవంతు లగుదురు). మూగవారు నమస్కరించినచో బృహస్పతిత్వమును పొందుదురు (అనగా వాక్కులు వచ్చి మహాపండితులై విహరింతురు) అటువంటి గురుదేవుల మహిమాన్విత పాదుకాయుగమునకు పదే పదే నమస్కరింతును.

- - - === - - -

04. నాళీక నీకాశ పదాహృతాభ్యాం (01)
నానా విమోహాది నివారికాభ్యామ్।
నమజ్జనాభీష్ట తతిప్రదాభ్యాం
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

శ్రీకరములయిన గురుదేవుల పాదుకలు పద్మములతో సమానములయిన పాదములచేత గ్రహింపబడినవి, నానావిధ విమోహాలు మొదలయిన ప్రమాదములను నివారించునట్టివి (అనగా అపమార్గమునుండి మరలించి సన్మార్గమున తమ భక్తులను నడిపించునట్టివి), నమస్కరించు భక్తజనులకు కోరినవాని నన్నింటిని అనుగ్రహించి ఆనందింప జేయునవి యగు గురుదేవుల పాదుకలకు అనేక నమస్సు లర్పింతును.

\- - - === - - -

05. నృపాలి మౌళి వ్రజరత్నకాంతి (03)
సరిద్విరాజత్ ఝషకన్యకాభ్యామ్।
నృపత్వదాభ్యాం నతలోకసంతతేః
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

శ్రీకరములయిన గురుదేవుల పాదుకలు తమకు నమస్కరించు రాజుల శిరస్సమూహములందలి రత్నకాంతులనెడి నదులలో ప్రకాశించుచున్న చిన్న చేపల వంటివి. (అనగా రాజులు తలలు వంచి పాదుకలకు మ్రొక్కు నపుడు వారి కిరీటముల లోని మణికాంతులు ప్రవహించి పాదుకలు శోభించును) తమకు నమస్కరించినవారికి అందరికి రాజయోగమును కలిగించునవి యగు గురుదేవుల పాదుకలకు పునః పునః ప్రణామము లర్పింతును.

\- - - === - - -

06. పాపాంధకారార్క పరంపరాభ్యాం (05)
తాపత్రయాహీంద్ర ఖగేశ్వరాభ్యామ్।
జాడ్యాబ్ధి సంశోషణ వాడవాభ్యాం
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

సంపత్కరములయిన గురుదేవుల పాదుకలు పాపములనెడి చీకటులకు సూర్యుల సమూహములు. ఆధ్యాత్మకము – ఆధిదైవికము – ఆధిబౌతికము అనెడి త్రివిధ తాపము లనెడి సర్పరాజులకు పక్షిరాజయిన గరుత్మంతుని వంటివి. జడత్వమనెడి సముద్రమునకు బడబాగ్నివంటివి. (అనగా మాంద్యమును పోగొట్టి చైతన్యమును రగిలించి కార్యసాధనా మార్గమున ప్రవేశ పెట్టును). యగు గురుదేవుల పాదుకలకు పలుమారులు ప్రణా మములు చేయుదును.

– – – === – – –

07. శమాదిషట్కప్రద వైభవాభ్యాం (02)
సమాధిదాన వ్రతదీక్షితాభ్యామ్।
రమాధవాంఘ్రి స్థిరభక్తిదాభ్యాం
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

మంగళదాయకములయిన గురుదేవుల పాదుకలు శమము – దమము – ఉపరతి – తితిక్ష – శ్రద్ధ – సమాధానము అనెడి యారు సద్గుణములను కలిగించునట్టి వైభవముకలవి. అంతర శబ్దానువిద్ధము – అంతర దృశ్యానువిద్ధము – బాహ్య శబ్దాను విద్దము – బాహ్య దృశ్యానువిద్ధము – అంతర నిర్వికల్పకము – బాహ్య నిర్వికల్పకము అనెడి షడ్విధ సమాధులను సాధకులకు అనుగ్రహించుట యనెడి వ్రతమునందు దీక్ష వహించు నట్టివి – శ్రీమన్నారాయణుని చరణములందు సుస్థిరభక్తిని కలిగించు నట్టివి యగు గురుదేవుల పావుకోళ్లకు మరి మరి నమస్కరింతును.

– – – === – – –

08. స్వార్చాపరాణా మఖిలేష్టదాభ్యాం (09)
స్వాహాసహాయాక్ష ధురంధరాభ్యామ్।
స్వాంతాచ్ఛ భావప్రద పూజనాభ్యాం
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

మంగళదాయకములయిన గురుదేవుల పాదుకలు తమను అర్చించుటయందు పరమాసక్తి కలిగినవారికి ఇష్టములను అనుగ్రహించునట్టివి. పరమశివునితో సమానముగా భక్తులను రక్షించు శక్తి కలవి. మనస్సునందు పరిశుద్ధ భావము నొసంగగల పూజతో కూడినవి యగు గురుదేవుల పాదుకలకు శతసహస్ర నమస్సు లొనర్తును.

- - - === - - -

09. కామాదిసర్ప వ్రజగారుడాభ్యాం (08)
వివేకవైరాగ్య నిధిప్రదాభ్యామ్।
బోధప్రదాభ్యాం దృతమోక్షదాభ్యాం
నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

నమో నమః శ్రీ గురు పాదుకాభ్యామ్॥

మంగళకరములయిన గురుదేవుల పాదుకలు భక్తుల యొక్క కామము - క్రోధము - లోభము - మోహము - మదము - మాత్సర్యము అను షడ్విధ శత్రువు లనెడి సర్ప సమూహములకు గారుడమంత్రము వంటివి. వారికి వివేక వైరాగ్యములనెడి నిధులను అనుగ్రహించునవి, వారికి పరమాత్మజ్ఞానమును కలిగించునవి, తత్ఫలముగా వెంటనే వారికి మోక్షమును ప్రసాదించునవి యగు గురుదేవుల పాదుకలకు శతసహస్ర నమస్సు లొనర్తును.

- - - === - - -


॥ సర్వే జనాః సుఖినో భవంతు - లోకా సమస్తా సుఖినో భవంతు - సమస్త సన్మంగళాని భవంతు ॥

ఇతి శ్రీ " గురు పాదుకా స్తోత్రమ్ " సంపూర్ణమ్

- - -

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

Kiron Type Institute



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.–944 044 9650, 994 994 1430)